# "అభాసురులు"

చలికాలం......ఒక చక్కటి ఉదయం. ఇల్లాలు, అనురాగమనే పాలుపోసి మరీ కలిపి యిచ్చిన కాఫీ ఆప్యాయంగా చప్పరిస్తున్నాడు విశ్వం. అతడి కెదురుగా కొంపటి కాస్త దూరంలో పీటమీద కూర్చుని కాఫీ తాగుతున్న పార్వతి భర్త వేపు చూచింది...అర్థనిమీలితనేత్రుడై ఏదో లోకాల్లో విహరిస్తున్నట్లున్నాడు విశ్వం.

"ఏమండోయ్...! మిమ్మల్నే!' అంది పార్వతి.

"ఉష్! 'మూడ్' పాడుచెయ్యకు. అలా చూడు..." అన్నాడు విశ్వం పెరటివేపు చూపుడువేలు చూపిస్తూ.

"...ఏముందీ?" అంది పార్వతి...అంతటితో వూరుకోలేదు. "...నుయ్యీ. నూతిగట్టూ, అవతలగా ఒకే ఒక వేపచెట్టూ, ఆ తర్వాత గోడ, అటుపైని వైష్ణవుల మేడా!" అని కూడా అంది.

"ప్చ! ఎన్నేళ్ళు నాతో సహచర్యం చేస్తేనేం? అవేనా నీ కనిపించటం?" విసుగ్గా చూచాడు విశ్వం.

"ఆఁ! అవే!" నిక్కచ్చిగా చెప్పింది పార్వతి.

"పిచ్చిపిల్లా! అలా చూడు...పిల్ల తెమ్మెర్లు చల్లగా వీస్తున్నాయి..."

"ఇప్పుడా ?" నవ్వుతున్న పార్వతి కళ్ళు మరింత పెద్ద వయ్యాయి.

"...బాలభానుడు బంగారు కిరణాలతో, సప్తాశ్వరథారూఢుడై ఉరకలు వేసుకుంటూ వస్తున్నాడు..."

ఇక ఆపుకోలేక పార్వతి ఫకాలున నవ్వేసింది...

"ఒక్కమాట నిజం చెప్పండి! ఈ మహాపట్నంలో మూడేళ్ళుగా వుంటున్నాం ... ఏనాడేనా సూర్యోదయం కళ్ళతో చూచామా ?"

విశ్వం రుసరుసలాడాడు...

"తొమ్మిది గంటలమీదట సూర్యుణ్ణి చూడాల్సిందే తప్ప, ఈ మేడల మాటున బాలభానుడూ కన్పించడు, బంగారు కిరణాలూ చూడం..,"

"ఇదుగో పార్వతీ! నీకెన్ని మార్లో చెప్పాను ? చూచేవే, కనిపించేవే చెప్పాలా ? నా కవిహృదయాన్ని ఇంకా గుర్తించలేవా ?" విశ్వం అసహనంతో బాధపడి, ఖాళీ కాఫీ గ్లాసు కిందపెట్టేశాడు!

"అదా సంగతి? మళ్ళీ మరో కథ మొదలెట్టబోతున్నారన్నమాట! ఈసారే పత్రికవాడికి తల దిమ్మెక్కిస్తారు ? పాపం! ఏ జన్మలోనో ఏ పాపాలో చేసుకున్న వాళ్ళంతా ఇలా పత్రికా ఎడిటర్లుగా జన్మిస్తారట! అందరి కవిత్వాలనూ, అర్థంగాని కథలనూ, అగమ్యగోచరమైన వ్రాతలనూ భరించటమే వాళ్ళకు శిక్ష..."

"ఏయ్ ! పార్వతీ ! ఏమిటా వాగుడూ ? నే వ్రాసిందల్లా నాలుగు కథలు ! అవి నాలుగూ తిరిగొచ్చాయనేగా నీ ఎగతాళి ? చూచుకో ! చకచక మరో నాలుగు వ్రాసేస్తాను...ఎందుకు పత్రికల్లో పడవో, ఎలా పడవో చూస్తాను!" విశ్వం రోషంతో ముక్కుపుటా లెగరేస్తున్నాడు !

"...వేసుకోక యేం చేస్తారు ? ఊపిరాడకుండా రాసి పంపిస్తే చచ్చినట్లు వేసుకుంటారు...

పార్వతి మాటలు పూర్తికాకుండానే వీధిలోనుంచి "విశ్వనాథుడూ !" అంటూ వినిపించింది !

"అదుగో వచ్చాడు మీ ఉమాకాంతుడు ! వెళ్ళి అతగాడితో చెప్పకోండి. పిల్ల తెమ్మెరలూ, పీడకలలూ ! వంటిల్లు శుభ్రంచేసుకుని వంట మొదలెట్టాలిక!" అంది పార్వతి!

"రావోయ్ ఉమా !"

"నేనొక్కణ్ణే కాదోయ్ నాథం ! మన మిత్రులంతా వస్తున్నారు !" అన్నాడు ఉమాకాంతం హడావుడిగా లోపలికి వస్తూ.

"చచ్చాను బాబోయ్! పొద్దున్నే కొట్టుకువస్తున్నారు! కాఫీ లడుగుతారు కాబోలు !" అంది విశ్వనాథం మనస్సు చిరాకుపడ్తూ.

"అలా గాభరాపడకు ! నీ ఇల్లాలు పేరు చెప్పు ! చాలు !" అంది హృదయం ధైర్యాన్ని రంగరించిపోస్తూ !

విశ్వనాథం మనస్సు హెచ్చరించినంత పనీ అయ్యింది!

ఉమాకాంతం, వెంకటేశం, భానుమూర్తి, సుదర్శనం నలుగురూ కూర్చొనీ కూర్చోగానే...

"చలికాలం ఉదయంరా బాబూ ఇది! వచ్చిన స్నేహితులకు ఒక డోస్ కాఫీ పోద్దామనే ఆలోచనేనా లేదా నీకు?" అన్నాడు ఉమాకాంతం నిర్మోహమాటంగా.

విశ్వనాథం గొంతు సవరించుకున్నాడు..."అబ్బాయ్! ఏమైనా అనుకోండి! ఎన్నైనా తిట్టుకోండి...మా ఇంట్లో ఇలాటి పిచ్చి వేషాలు కుదరవు!"

"అంటే...మీ ఆవిడ..." సందేహాస్పదంగా నసిగాడు సుదర్శనం.

"ఆ...ఆ! ఆవిడ మహా కరెక్టు మనిషి! ఒకసారిలాగే నేను బుద్ధినేరక వేళగాని వేళలో కాఫీ అడిగాను...అప్పుడేం జరిగిందో తెలుసా!" వెంకటేశం ఆ దృశ్యాన్ని యిలా వివరించాడు...

పార్వతి దగ్గరకు హడావుడిగా పరుగెత్తాడు విశ్వం.

"పార్వతీ! వెంకటేశం కాఫీ అడుగుతున్నాడు! అసహ్యంగా ఉంటుంది...పరువుపోతుంది...బావుండదు ..ఏమైనా అనుకుంటాడు..." విశ్వం అలా చెప్పుకు పోతూనే వున్నాడు ...పార్వతి వాకిటి గదిలో వుందా సరికి!

"అన్నయ్యా!"

ఆ సంబోధనకు ఉలిక్కిపడ్డాడు వెంకటేశం... కుర్చీలో సర్దుకూర్చున్నాడు!

"ధర లెలా మండిపోతున్నాయో నే చెప్పనవసరం లేదు! ప్రతి గృహిణీ పొదుపు చేస్తేనే గాని అదుపులోకి రాని సమస్య ఇది! స్నేహితులకు కాఫీలూ, హితులకు విందులూ, వివాహాలకు వినోదాలూ, అవివాహితులకు విలాసాలూ అంటూ ఖర్చు పెట్టడం సబబంటారా?"

వెంకటేశం తల అన్ని దిక్కులూ తిరిగిం దొక్క క్షణంలో! చివరకు పార్వతి కభిముఖమైన తల హీనస్వరంతో.

"అవునమ్మా!" అంది!

"కదామరి! అందుకే నేను కచ్చితంగా వుండదల్చుకున్నాను. లేనిపోని గొప్పలకు పోయి, పొదుపు పథకాన్ని భగ్నం చెయ్యటం నాకిష్టం లేదు... అదే వారికి కష్టం... పోనీ యిందులో ఏదైనా పొరబాటుందేమో మీరే చెప్పండన్నయ్యా!" అంది. వెంకటేశమే గాకుండా, విశ్వనాథం కూడా బిక్క మొఖం వేశాడు...

"అబ్బే! పొరబాటేమీ లేదమ్మా! నన్నడిగితే మీరు ఆదర్శగృహిణు లంటాను... అవునోయ్ విశ్వం... మరి నే వెళ్ళొస్తా! సాయంత్రం కలుస్తా!"

పార్వతి నవ్వు ఎంతసేపటికోగానీ ఆగలేదు. ఆ తర్వాత...ఆ దృశ్యం-సవిస్తరంగా వినేసరికి, ఉమాకాంతం గుండె ఒక్కసారిగా ఝల్లుమంది!

"కాఫీలూ గట్రా వెధవ్వేషాలు ఏమీ ఒద్దులేవోయ్!" అనేశాడు సుదర్శనం...

కాస్సేపు నిశ్శబ్దం విలయతాండవం చేసింది.

“ఇంతకూ మీ రిలా ఉదయాన్నే వచ్చినపని...?” నసిగాడు విశ్వం.

“ఆ...అసలువిషయానికొద్దాం!” అన్నాడు భానుమూర్తి.

విశ్వం చెవులు రిక్కించుకున్నాడు.

“మన సుదర్శనానికి తెల్లారుఝామున ఓ కల వచ్చిందిట..” నాంది పలికాడు ఉమాకాంతం.

“ఏం కల?” కుతూహలంగా అడిగాడు విశ్వం.

“సుదర్శనం వ్రాసిన కథ పేద్ద ప్రఖ్యాత పత్రికలో అచ్చైవచ్చిందిట! అచ్చై పూరికే తిరిగిరాలేదు! పోటీలో గెలుపొంది, వెయ్యిరూపాయలు బహుమతి, అపారమైన కీర్తి ప్రతిష్టలూ కూడగట్టుక మరీవచ్చిందిట!”

“ఎవరూ?” అన్నాడు విశ్వం!

“ఛస్! కలోయ్!”

“ఆహాఁ!”

“ఊ! ఆ కలలోనే, సుదర్శనానికి పేద్ద సన్మానసభ జరిగి, దుశ్శాలువలు బహుమతి చేశారట కవి సమ్మేళనంలో, ఆ సభలో మనమూ పాల్గొన్నామట! మనకూ తలకో దుశ్శాలువా బహూకరించారుట!”

“హూం!” నిట్టూర్చాడు విశ్వం. వెంటనే అన్నాడు “కలలన్నీ కల్లలని మన పెద్దలు ఏనాడో చెప్పారు!”

సుదర్శనం ఛ(్రుమన్నాడు. "అన్నికలలూ కల్లలు ఎప్పుడూ కావు. తెల్లవారుఝామున వచ్చిన కలలు తప్పక నిజమౌతాయి. తెలుసా ?"

విశ్వం జాలిగా చూశాడు సుదర్శనం వేపు.

"అదికాదోయ్ సుదర్శనం ! మన రచనలు అచ్చేసుకునే పత్రికా ఎడిటర్ ఇప్పటికింకా జన్మించలేదు ! ఎప్పుడో అలాటి వాడు జన్మించి, మన కథలు అచ్చుకాబోయేసరికి మనకీ భూమ్మీద నూకలు చెల్లిపోయి వుంటాయి ! ఒకవేళ్ళ, అదీ ఇదీ 'రెండూ సంభవించినా (అంటే, పత్రికా ఎడిటర్ జన్మించటమూ మన కథలు అచ్చువెయ్యటమూ, ఆ సరికి (బతికి వుండటమూ) మన కథలకు బహుమతి ఇచ్చేది కల్ల ! మనల్ని కవిసమ్మేళనంలోకి ఆహ్వానించేది ఇలలో జరగనిపని. ఇక దుశ్శాలువల బహుమతి ప్రదానం మనకు కలల్లో మాత్రమే జరిగేపని !,,

ఖరాఖండీగా అలా విశ్వం చెబుతుంటే, మిగతా కలు గురుమిత్రులూ గుడ్లు తేలవేశారు క్షణకాలం, మరునిముషంలో వెంకటేశం పుంజుకున్నాడు.

"నువ్వుచెప్పినవన్నీ మేమే ఆలోచించుకున్నామోయ్. అందుకే ఓ పథకం తయారుచేశాం ?" అన్నాడు.

"ఏమిటా పథకం ?" కుతూహలంగా అడిగాడు విశ్వం.

"మనం ఐదుగురం కలసి ఓ సంఘం స్థాపిద్దాం! అది రిజిష్టర్ చేయిద్దాం. సభ్యత్వపు ఫారాలు అచ్చువేయిద్దాం..."

ఊపిరి పీల్చుకున్నాడు వెంకటేశం.

ఉమాకాంతం కొనసాగించాడు. ‘‘ఆసంఘం పేరు ‘‘అఖిల సురచయితల సంఘం !’’ పొడిఅక్షరాలలో అధునాతనంగా పిలవాలంటే, ‘‘అభాసుర’’ల సంఘం.

‘‘సు’’ ఎందుకూ ? విశ్వం అయోమయంగా అడిగాడు.

‘‘ఏహ్ ! పిచ్చిసన్యాసీ ఆమాత్రం తెలీదూ!’’ భానుమూర్తి త్రికాలజ్ఞుడిలా నవ్వాడు.

‘‘చెప్పరాదూ ? తెలిస్తే !’’ విశ్వం చిరాకుపడ్డాడు

‘‘విను మరి. మనలో గోత్రాలు చెప్పేటప్పుడు ఎలా చెబుతారు ? కాశ్యప ‘స’ గోత్రమనీ, కౌశిక ‘స’ గోత్రమనీ, భారద్వాజ ‘స’ గోత్రమనీ ఇలా గోత్రానికిముందు స = మంచి అని చేరుస్తారు కదూ? అలాగే మన సంఘానికి ముందు ‘‘సు’’ అంటే మంచి (అనే అర్థంకూడా వుంది) అని పెడదాం. వెరసి ‘‘అభాసురల’’ సంఘం !’’

‘‘ఊ ! తర్వాత ?’’ విసుగ్గా అన్నాడు విశ్వం.

ఈసారి సుదర్శనం మొదలెట్టాడు ! ‘‘ఈ సంఘంలో చేరే ప్రతి సభ్యుడూ, సభ్యురాలు, సభ్యత్వపు రుసుము క్రింద ప్రతి సంవత్సరమూ పదిరూపాయలు చెల్లించాలి ! తాత్కాలిక సభ్యునిగా చేరేందుకు పది, ఐదేండ్లు సభ్యత్వం వుండేందుకు పాతిక. శాశ్వత సభ్యులు కాదల్చుకున్నవారు నూటపదహార్లు యిలా రేట్లు నిర్ణయించి డబ్బు కట్టించుకొని సభ్యులుగా చేర్చుకుందాం !’’

విశ్వం తెల్లముఖం వేశాడు! ఈ పథక మేమిటో అతగాడికి బొత్తిగా అంతుపట్టడం లేదు! అసలిలా డబ్బు కట్టించుకోవాల్సిన అవసరమేమిటో తెలియటం లేదు! ఆ మాటే అన్నాడు.

"అయ్యో! ఇందుకే అన్నార్రా పెద్దలు, 'తెలివి ఒక డబ్బుసొమ్మా?' అని. వినుమరి!" ఉమాకాంతం మొదలెట్టాడు: "అలా పోగైన డబ్బుతో, మనం వ్రాసే కథలూ, నవలలూ అచ్చేయించుకుందాం! ఆ డబ్బుతో ఓ పత్రిక స్థాపిద్దాం! ఆ పత్రికలో మనం వ్రాసే కథలూ, మన సంఘ సభ్యులు వ్రాసే కథలూ మాత్రమే ప్రముఖస్థానం వహిస్తాయి!"

"ఆ పత్రిక మనంమాత్రమే చదువుకుంటాం. అవునా!" అన్నాడు విశ్వం నవ్వుతూ!

"ఛస్! అలా మాట్లాడకు నాలుగు నెలలు వరసగా మార్కెట్‌లోకి వదిలితే, మనపత్రిక రామబాణంగా దూసుకపోదూ? తర్వాత ప్రతి ఎడిటరూ మనల్ని వెదుక్కుంటూ వస్తాడు కథలు తమ పత్రికల కివ్వమని...

అలా మరో నాలుగు పత్రికలలోకి మనపేర్లు ప్రాకాయంటే చాలు, మనం ప్రఖ్యాత రచయితలమై కూర్చుంటాము. మన కథలకూ, రచనలకూ ఎక్కడలేని పాప్యులారిటీ వచ్చి కూర్చుంటుంది. సుదర్శనం కల నిజమౌతుంది కూడాను."

వెంకటేశం అప్పుడే వూహాలోకంలోకి జారిపోయాడు.

విశ్వం నిట్టూర్చాడు. "మీపథకం కేవలం ఊహల్లానే తోస్తోంది నాకు. అసలలా డబ్బుకట్టే సభ్యులెవరు? అదలా

వదిలెయ్! ఇంతకూ మనసంఘానికీ, ఈ పథకానికీ మనం ఎంత డబ్బుకట్టి, తగలెయ్యాలి? అన్నాడు...

"అదుగో శకునపక్షిలా మాట్లాడకు! మనం డబ్బులు కట్టక్ఖర్లేదు. చేరబోయే సభ్యులుమాత్రం కడతారు." వెంకటేశం సూచించాడు.

"ఎన్నటికీ కట్టరు! ఈ రోజుల్లో ప్రతి రచయితా కాస్తో కూస్తో ప్రతిఫలం ఆశించి కథలూ, కారణాలూ వెలగబెడ్తున్నాడుగానీ, తను చేతిడబ్బులు ఖర్చుపెట్టుకొని, అచ్చులో పేరుచూచుకొని ముచ్చటపడాలనే పిచ్చివాడెవడూ లేడు." విశ్వం నిజం చెప్పాడు.

"ఉన్నారు! కొల్లలుగా వున్నారు. ఏదో ఓ అనామక పత్రికలోనయినా సరే తమ పేరుచూచుక మురిసిపోవాలని తహతహలాడే యువరచయిత లెందరో అన్నారు! వాళ్ళందరూ చేరుతారు మన సంఘంలో."

"సరే అలా చేరుతారే అనుకుందాం! తర్వాత చేసేదేమిటి?" విశ్వం రాజీకొచ్చాడు,

"అలా వాళ్ళు మన సంఘంలో చేరగానే, వాళ్ళ పిలక మన చేతిలోకొచ్చినట్లే అనుకో!" భానుమూర్తి తిరిగీ మొదలెట్టాడు.

"కథలు, వ్యాసాలు, నాటికలు, నవలలు పంపమని వ్రాద్దాం వాళ్ళందరికీ!"

"ఊఁ!"

"కథతోబాటు రెండురూపాయలు మనియార్డరు చెయ్యాలి !"

"ఎవరు ?" అదిరిపడ్డాడు విశ్వం.

"మనం కాదు లే! మన సభ్యులు! వ్యాసంతో బాటు..."

భానుమూర్తిమాట పూర్తి చేసేలోపలే విశ్వం అందుకున్నాడు. "...వ్యాసంతోబాటు నాలుగు రూపాలు, నాటికతో ఆరు, నవలతో పది ! అంతే! మొదటి కథతో వాళ్లు సభ్యత్వం ఉపసంహారించుకుంటారు."

"ఉష్ ! ప్రతి మాటకూ అడ్డురాకు ! పూర్తిగా విను!" భానుమూర్తి విసుక్కున్నాడు.

ఊఁ ! కానీ ! అప్పుడే టైం తొమ్మిది దాటింది ! ఇక షేవ్ చేసుకొని స్నానంజేసి, భోజనంచేసి ఆఫీసులకు వెళ్ళాలి మనం." వాస్తవిక ప్రపంచాన్ని గురించి సూచనప్రాయంగా తెలియజేశాడు విశ్వం.

"తర్వాత మూడు నెలలకో పోటీ నిర్వహిద్దాం యాభై రూపాయల దగ్గర్నుంచి పదిరూపాయలవరకూ బహుమతులు పంచేట్లు..."

"ఏం పెట్టి ?" విశ్వం ఛర్రుమన్నాడు !

"అదో మళ్లా మొదటికొచ్చావ్ ! పోటీకోసం పంపే ప్రతి రచనతో, ఐదురూపాయలు జతచెయ్యాలనే నిబంధన కూడా వుంటుంది ! అలా వచ్చిన డబ్బులోనే మన పత్రికకు పోను, పోటీలో పాల్గొన్నవారికిబహుమతులు పంచిపెడదాం!"

“ఇందులకు కూడా మరో కిటుకు!” ఉమాకాంతం బల్ల మీదకు వంగి విశ్వానికి తత్వబోధ చేసే పోజ్ వేశాడు.

“ఏమిటో అది ?”

“వీథుల్లో లాటరీవాడొకడు కూర్చొని వుంటాడు చూశావ్ !”

“ఆ!”

“వాడిదగ్గర స్టీలు మరచెంబులూ, పాన్‌దాన్‌లూ, పెన్‌లూ, ఒకటేమిటి అన్నివస్తువు లుంటాయ్. ‘బేడ కడితే పెన్ను, పావలాకు అద్దం, రూపాయికి స్టీలు మరచెంబు’ అలా కేకలేస్తాడు! తలో బేడా, పావలా, రూపాయీ, రెండు కడతారుకదూ? అందులో ఏ ఒకడికేనా ఆ వస్తువులు ఇస్తున్నాడా వాడు? అలా సాయంత్రం వరకూ జనం డబ్బులు కడ్తూనే వుంటారు! హఠాత్తుగా ఒకడో రూపాయికట్టి, స్టీలు మరచెంబు గెల్చుకుంటాడు. అది అంతటితో ఆపేస్తాడు. వాడు మర్నాడు మరో వీధిలో వెలుస్తాడు! నిన్నటిస్టీలు మరచెంబు తిరిగి యథాస్థానంలో వుంటుంది!” ఉమాకాంతం ఆగాడు.

“అరె ఎలా వుంటుంది? నే నెప్పుడూ చూళ్లేదురా!” అన్నాడు విశ్వం ఆశ్చర్యంగా.

“అదే కిటుకు! ఆ స్టీలు మరచెంబు గెల్చుకున్నవాడు వాడి తమ్ముడో, అన్నో, కొడుకో అయి వుంటాడు! జనాన్ని ఆకర్షించడంకోసం వాడూ మందిలో కలిసి మనలాగ డబ్బుకడతాడు! వాడు గెల్చుకోవటం చూచి మిగతావాళ్ళు మరింత

ఎగబడతారు! వాళ్ళ వస్తువు పోకుండా, అమాయకుల్ని నిలువు దోపిడీ చేసేస్తారలా!’’

‘‘అలాగే మనంకూడా...?’’ విశ్వం అయోమయంగా చూశాడు.

‘‘ఊఁ! సరిగ్గా అలాగే మనంకూడా ‘‘పోటీలు’’ అని ఏర్పాటుచేసి, పోటీకొచ్చిన రచనతో బాటు డబ్బుపంపాలనే నిబంధన పెట్టి, తీరా పోటీలో మనలో ఒకడు గెలుపొందినట్లు పేరు ప్రకటించి ఆ బహుమతి అందుకుంటాం! అది మనదగ్గరే పదిలంగా వుంటుంది. వచ్చిన డబ్బుతో పత్రిక దిగ్విజయంగా నడుస్తుంటుంది! ఇంకా మిగిలితే మనవలలూ అచ్చువేయించుకోవచ్చు!’’ భానుమూర్తి పూర్తిచేశాడు!

‘‘అబ్బాయ్! ఇదేదో ప్రాణాంతకంగా వుంది! ఖర్మం చాలక ఏ శ్రీకృష్ణజన్మస్థానానికో తీసికెళ్ళరుకదా?’’ భయంగా అన్నాడు విశ్వం.

‘‘ఇందులో శ్రీకృష్ణజన్మస్థానం ప్రస్తావనేముందనీ? మన సంఘ నిబంధనలలోనే స్పష్టంగా అన్నీ వ్రాస్తున్నాం కదా? పైగా రిజిష్టరు కూడా చేయిద్దాం! అన్నట్లు మర్చిపోయా. మన సంఘానికీ పత్రికకూ ఉదారదాతగా వుండేందుకు ఎవరైనా మాంఛి పలుకుబడి గల పెద్దమనిషిని ఎన్నుకుందాం! లేదా ఏ మంత్రిగారినో బతిమాలుకుందాం! ఉట్టినే పేరొస్తుందంటే వద్దనే పెద్దమనిషెవడోయ్ యీ రోజుల్లో!’’

‘‘మరునిముషంలో నుంచి’’

ఫలానా మంత్రిగారు, ఫలానా మా పత్రిక, సంఘం కోసం ఫలానా మొత్తం విరాళంగా యిచ్చారు. మరెవరేనా దాత లిలాగే విరాళాలు, పాతిక, ముప్పై, యాభై. వంద, నూట పదహార్లు, శ్రేణిలో యిచ్చి శాశ్వత సభ్యులుగా చేర వలసిందిగా కోరుదాం! లక్షలకొద్దీ డబ్బుండి, అక్షరమ్ముక్క చేతరాని పెద్దమనుషు లెందరో, గొప్పకోసం విరాళాలిస్తారు. చూస్తుండు!'' ఉమాకాంతం వివరించాడు.

"ఏమో మీ యిష్టం!'' ఉస్సురని లేచాడు విశ్వం.

"చాలు! ఆ మాట చాలు! ఇక చూచుకో ఐదేళ్ళలో మన ఐదుగురికి నిజంగానే ఘన సన్మానాలు, దుశ్శాలువల బహుమతి ప్రదానం జరిగితీరుతుంది. నా కల నిజమై... నే నిలలో రచయితనై, నా నవల అచ్చై, నా లీల అద్భుతమై..." సుదర్శనం పగటి కలలుకంటూ బయటికి నడిచాడు. మిగతా ముగ్గురూ అనుసరించారు!

''హమ్మయ్య!'' నిట్టూర్చిన విశ్వం గడియారం ముల్లు పదిగంటలు సూచించటం చూచి కెవ్వున కేకవేసి లోపలికి పరుగెత్తాడు.

మూడు సంవత్సరాల తర్వాత —

క్కాళ్ళమీద బాబును వేసుకొని పౌడర్ రాస్తున్న పార్వతి తలెత్తిచూచింది. విశ్వం కట్టలకొద్దీ అచ్చుకాగితాలెవో చిత్తు కాగితాల బుట్టల్లో పడేస్తున్నాడు.

"అదేమిటి? మీసంఘనిబంధన కాగితాలుకదూ అవి? అలా పారేస్తున్నారెందుకూ?" ఆశ్చర్యంగా అడిగింది పార్వతి.

"ఇంకా పూజించటం దేనికి ? మా సంఘంలో మొత్తం సభ్యులం పదిమంది. సుదర్శనం, వెంకటేశం, విశ్వనాథం, ఉమాకాంతం, భానుమూర్తి, శ్రీదేవి, పద్మావతి, పార్వతి, గౌరీదేవి, భారతీదేవి. వీళ్ళు తరగలేదు, పెరగలేదు."

"మీ పోటీ సంగతేమైంది ?" పెదాలచాటున నవ్వు అణచుకుంటూ అడిగింది పార్వతి.

"అసలు పోటీకి కథలెవరు పంపించారూ ? మేం రాసిన ఐదు కథలకూ మాకు బహుమతి ఇచ్చే దాత ఎవడు? అందుకే ఈ రోజుతో మా సంఘాన్ని రద్దు చెయ్యదల్చుకున్నాం!"

పిల్లాణ్ణి ప్రక్కన కూర్చోబెట్టి, పార్వతి కిలకిల నవ్వింది.

"మీ సంఘం పేరేమిటన్నారు ? అఖిలభారత సురచయితల సంఘం కదూ! కాదుకాదు "అభాసురుల సంఘమా?" అదీకాదు "అభాసురాయుళ్ళ సంఘం."

విరగబడి నవ్వుతున్న పార్వతిని చూచి ఏమీ అర్థంగాని పసివాడు అమాయికంగా బోసినవ్వులు నవ్వుతున్నాడు ! భ్రమరకీటక న్యాయ ప్రకారం నవ్వుతున్న బాబునూ, భార్యనూ చూచి విశ్వం కూడా ఆ నవ్వులలో శృతికలిపాడు.